సాక్షి
శ్రీకాకుళం
గురువారం : 16 : ఫిబ్రవరి : 2023



జనం చెంతనే రక్తసేకరణ

రక్త సేకరణకు సంచార అంబులెన్స్ సిద్ధమైంది. ముఖ్య కూడళ్లలో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి ప్రాణదాతగా నిలుస్తోంది. - 8లో



ఎంఈఎంయూ రైలు పునఃప్రారంభం

కరోనా సమయంలో రద్దయిన ఎంఈఎంయూ ప్యాసింజర్ రైలు పునఃప్రారంభమైంది. దీంతో జిల్లా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా పీజీ డిప్లమా కోర్సు(ఏడాది)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం చెప్పారు. మార్చి 6లోగా దరఖాస్తు చేసుకోవాలని, కోర్సు ఫీజు రూ.10 వేలని తెలిపారు. వివరాలకు డీఆర్‌బీఆర్ఏయూ.ఈడీయూ.ఇన్ గానీ, యోగా విభాగం కోఆర్డినేటర్ అరుణ (9490677790) ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలీసులు సన్నద్ధం

శ్రీకాకుళం క్రైమ్ : శాసనమండలికి సంబంధించి ఎన్నికలకు పోలీసు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ జరిగే కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా వాహన తనిఖీలు చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

108 వాహనాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ ప్రకాశ్

మందస: మండలంలోని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద 108 అంబులెన్స్‌లను ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ ప్రకాశ్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, వాహనంలోని ఆక్సిజన్ లభ్యత, పరికరాలు, రోగుల, బాధితుల నమోదు వివరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరును ప్రశంసించారు. అనంతరం పలాస, కవిటి వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హరిపురం సీహెచ్‌సీ సూపరింటిండెంట్ ప్రకాశ్‌వర్మ, డాక్టర్ హేమచంద్ర, 108 సిబ్బంది సత్యం, గోపాలకృష్ణ, బాలకృష్ణ, ఆనందరావు, రామచంద్రారెడ్డి, రాము, మురళీమోహన్ పాల్గొన్నారు.


సిక్కోలులో సినీనటుడు కిరణ్ సందడి



ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న కిరణ్

శ్రీకాకుళం అర్బన్: గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్‌రాజు సమర్పణలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రం మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 18న విడుదల కానుందని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని ఎస్‌వీసీ థియేటర్‌లో సినిమా ప్రమోషన్‌లో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను అలరించేలా సినిమా ఉంటుందన్నారు. మంచి సినిమా చూశామనే అనుభూతిని ప్రేక్షకులు పొందుతారని చెప్పారు. తాను జిల్లాకు రావడం ఇదే మొదటిసారని, సిక్కోలు ప్రేక్షకుల ఆదరణ మరువలేనిదన్నారు. తన తదుపరి చిత్రం మైత్రీమూవీ మేకర్స్ సారథ్యంలో 'మీటర్' సినిమా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తులో కచ్చితత్వం అవసరం



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : కేసుల దర్యాప్తు కచ్చితత్వంతో చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చేసి తద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్ష పడేలా అధికారులు, సిబ్బంది కృషి చేసి శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి దర్యాప్తు పూర్తయ్యే వరకు కేసు పత్రాలు, సాక్షుల విచారణ, కోర్టుకు సమర్పణలో అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసులు ఛేదించాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులతో అవగాహన కల్పించాలని సూచించారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలపై త్వరగా దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతికత ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ముఖ్యమైన కేసుల్లో ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టుల మేరకు దర్యాప్తు చేపట్టాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరగకుండా భద్రతా నియమాలపై వాహన చోదకులకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. రాత్రివేళల్లో వాహనచోదకులకు ఫేస్ వాష్ చేయించాలని, తనిఖీలు చేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు ఎం.మహేంద్ర, శివరామిరెడ్డి, వాసుదేవ్, శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఏఓ శివరామరాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





భక్తుల తన్మయత్వం..



జలవిహార వీక్షణం..

సమనోహరం.. వాసుదేవుని జలవిహారం

మందసలో కొలువుదీరిన వాసుదేవుడు పొన్నచెట్టు వాహనరూఢుడై ఉభయ దేవేరులతో తెప్పలో జలవిహారం చేశాడు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గోపాలసాగరంలో జరిగిన ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. జల విహారం చేస్తున్న వాసుదేవున్ని చూస్తూ కేరింతలు కొడుతూ తన్మయత్వం చెందారు. అంతకుముందు సాగరతీరాన ప్రత్యేక పూజలు చేశారు. – మందస

ఉద్దానం ఉరకలు



హిరమండలం వద్ద నీటిని పంపింగ్ చేసే విభాగంలో నిర్మాణాలు

ప్రాజెక్టు రిపోర్టు

ఉద్దానం.. నయనానందకర ఉద్యానం. పుడమికి పచ్చని వడ్డాణం. కానీ.. ఈ సుందర సీమ హృదయంలో అంతులేని కన్నీటి కాసారం. కిడ్నీ వ్యాధి రూపంలో వేధిస్తున్న విషాదం. అయితే ప్రతి వేదనకూ ఓ ఉపశమనం ఉంటుంది. ఉద్దానానికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో సాంత్వన దక్కుతోంది. సమస్య తీవ్రతను ఇప్పటికే దృష్టిలో ఉంచుకుని పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన జగనన్న ప్రభుత్వం అనేక ఉపశమన చర్యలు చేపట్టింది. ఉద్దాన ప్రాంతంలోని ఇంటింటికీ మంచినీరు కుళాయిల ద్వారా సరఫరా చేసే ధ్యేయంతో ప్రభుత్వం చేపట్టిన ఉద్దానం మంచి నీటి ప్రాజెక్ట్ తొలిదశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అతి త్వరలోనే ట్రయిల్ రన్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉద్దానం వైపు వంశధార వడివడిగా అడుగులేసే తరుణం ఆసన్నమైంది.

- ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు తొలిదశ నిర్మాణాలు పూర్తి
- శరవేగంగా తాగునీటి పైపులైన్ పనులు
- ఇప్పటికే పూర్తయిన ట్యాంకుల నిర్మాణం
- అనుసంధాన పనుల్లో నిమగ్నమైన యంత్రాంగం

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎనిమిది మండలాల ప్రజలకు ఇంటింటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టినా కరోనా కారణంగా కొద్ది నెలలు పనులు నిలిచిపోయాయి. అనంతరం ప్రారంభమైన పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. హిరమండలం నుంచి మెళియాపుట్టి మీదుగా ఇచ్ఛాపురం వరకు తొలిదశ పనులు పూర్తయ్యాయి.

కాస్త ఆలస్యమైనా..

ఉద్దాన ప్రాంతంలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలతో పాటు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి ప్రజలకు శుద్ధజలం అందించేందుకు ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కిడ్నీ రోగులకు నదీ ప్రవాహ నీటిని అందిస్తే వారి ఆరోగ్యాలు బాగుపడతాయనే ఉద్దేశంతో ప్రాజెక్టును ప్రారంభించారు. తొలుత అంచనా వ్యయం రూ.600 కోట్లు అనుకున్నా పెరిగిన ధరల కారణంగా రూ.700 కోట్లకు చేరింది.

- వంశధార ప్రాజెక్టు(హిరమండలం) నుంచి 50 కిలోమీటర్లు మెగా పైపులైన్‌ను ఇచ్ఛాపురం వరకు వేస్తున్నారు. ఈ పనులు మూడు భాగాలుగా కొనసాగుతుండగా ఇటీవలే పనులు ఇచ్ఛాపురం చేరుకున్నాయి.
- మెగా పైపులైన్ నుంచి గ్రామాలకు 134.818 కిలోమీటర్ల మేర మినీ పైపులైన్ వేసి వాటి ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు.
- మొత్తం 809 గ్రామాల్లో 7లక్షల 82వేల మందికి సరిపడా తాగునీరు అందించడానికి ప్రాజెక్టు డిజైన్ చేశారు. 22 గంటలు పంపింగ్ చేస్తూ ప్రతి వ్యక్తికి రోజుకి 100 లీటర్లు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నారు.
- 24 నెలల్లోనే అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా కరోనా కారణంగా సకాలంలో పూర్తి చేయలేకపోయారు.



మందస మండలం గోపుటూరు వద్ద మూడు గ్రామాలను కలిపే జంక్షన్‌లో పైపులైన్

అంకెల్లో వాటర్ గ్రిడ్..

వాటర్ గ్రిడ్‌కు కేటాయించిన నిధులు	రూ.700 కోట్లు
వంశధార నుంచి వినియోగించే నీరు	1.12 టీఎంసీలు
పైపులైను పొడవు	50 కి.మీ
ఫిల్టర్ సామర్థ్యం	84 ఎంఎల్
మొత్తం ట్యాంక్‌లు	571
మొత్తం గ్రామాలు	807
మండలాలు/ నియోజకవర్గాలు	08/02
మున్సిపాలిటీలు	02
వార్డులు	60
ప్రయోజనం పొందే ప్రజలు	7,82,707
చిన్నాపెద్దా పైపులైన్ పొడవు	134 కి.మీ
ప్రతి యూనిట్‌కు రోజుకు	100 లీటర్లు
వాటర్ పంపింగ్ రోజుకు	22 గంటలు

చకచకా పనులు

వాటర్ గ్రిడ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తొలిదశ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. హిరమండలం, మెళియాపుట్టి, శాశనలపుట్టుగ వంటి ప్రధానమైన ఫిల్టర్‌పాయింట్లు, మెగా ట్యాంక్‌ల కట్టడాలు పూర్తయ్యాయి. హిరమండలం నుంచి వచ్చే 50 కిలోమీటర్లు మెగాపైపు లైన్ పనులు ఇచ్ఛాపురం వరకూ సాగుతున్నాయి.మెగా పైపులైన్ నుంచి సబ్‌లైన్లకు అనుసంధానమైన పైపులైన్, వాటర్ ట్యాంక్‌ల అనుసంధాన పనులు నిరాటంకంగా సాగుతున్నాయి. మరి కొద్దినెలల్లో పూర్తి చేసి ట్రయల్ రన్‌కు సిద్ధమవుతాం.

– ఆశాలత, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, శ్రీకాకుళం



పలాస నుంచి ఇచ్ఛాపురం మధ్య మెగా పైపులైన్ పనులు



అనంతగిరిలో 150 కేఎల్ ట్యాంక్



అనంతగిరిలో ఇంటింటా కుళాయి

పూర్తయిన ముఖ్యమైన నిర్మాణాలు..

- హిరమండలం రిజర్వాయర్ వద్ద ఇంటాక్ వెల్ అండ్ పంప్ హౌస్ ఫ్లోర్ శ్లాబ్, రూఫ్ శ్లాబ్ 84.01 మీటర్ల ఎత్తుతో పూర్తి చేశారు.
- హిరమండలం రిజర్వాయర్ వద్ద అప్రోచ్ వంతెన డెస్ శ్లాబ్ (529.75ఎం)
- వంశధార నది క్రాసింగ్ (667.75 ఎం) పనులు
- ఎడమ కాలువ క్రాసింగ్ పనులు
- కొరసవాడ వద్ద 2000 కేఎల్ ట్యాంకర్
- మెళియాపుట్టి వద్ద 84 ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటిశుద్ధ ట్యాంకుల వద్ద పలు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. స్టెర్లింగ్ చాంబర్, ఫ్లాష్ మిక్సర్, క్లోరిన్ హౌస్, కెమికల్ హౌస్, క్లోరిన్ ట్యాంకర్, ఫిల్టర్ హౌస్, తదితర పనులు పూర్తి చేసుకున్నాయి.
- మెళియాపుట్టి వద్ద 9000 కేఎల్ క్లియర్ వాటర్ సంప్, మరో 1600 కేఎల్ ట్యాంక్, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ప్రధాన గ్రామాల్లో ప్రధాన ట్యాంక్‌ల నిర్మాణాలు పనులు పూర్తయ్యాయి.



మెళియాపుట్టి వద్ద ఫిల్టర్ పాయింట్‌లో వివిధ నిర్మాణాలు

21న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు డీఈఓ గార పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గుజరాతీపేటలో ఏపీఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో ఉప అంశాలవారీగా విజేతలుగా నిలిచిన వారు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనకరంగా ఉన్న ప్రాజెక్టులను నాణ్యతతో కూడినవి తయారు చేయాలన్నారు. థర్మాకోల్ ప్రాజెక్టులను అనుమతించబోమని స్పష్టంచేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనాలని సూచించారు. ఎగ్జిబిషన్‌కు నోడల్ అధికారిగా శ్రీకాకుళం ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్య వ్యవహరిస్తారని చెప్పారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోటీలు విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



జవాబుపత్రాలను పరిశీలిస్తున్న గ్రేస్

పాతపట్నం: గురుకుల విద్యాలయాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమన్వయాధికారి జి.గ్రేస్ అన్నారు. పాతపట్నం మండలం ప్రహరాజపాలెంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ వి.అర్చనకు సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మధ్యాహ్నం మెనూ పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల 'ఓపెన్ డే'

శ్రీకాకుళం న్యూకాలనీ: కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 17న ఓపెన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలను పెంచుకునే ప్రక్రియలో భాగంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు.. డిగ్రీ కళాశాలల్లో సౌకర్యాలు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వివరించి అవగాహన కల్పించేందుకు ఓపెన్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల విద్యార్థులు డిగ్రీ కళాశాలలను సందర్శించి అవగాహన పొందాలని కోరారు.

నాలుగేళ్ల తర్వాత సొంతగూటికి..

- తిరుపతికి బదులు నెల్లూరులో పొరపాటున దిగిన గేదెలవానిపేట వాసి
- అమాయకత్వం కారణంగా వివరాలు చెప్పలేక అక్కడే ఉండిపోయిన వైనం
- యూట్యూబర్ సాయంతో తిరిగి స్వగ్రామానికి



మాలితో కామరాజు (టవల్ ధరించిన వ్యక్తి)

ఆమదాలవలస: నాలుగేళ్ల కిందటి మాట.. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని గేదెలవానిపేటకు చెందిన సాధు కామరాజు తన గ్రామానికి చెందిన కొంతమంది తిరుపతిలో తాపీపని చేస్తుండటంతో వారి వద్దకు పనికోసం బయల్దేరాడు. మార్గమధ్యలో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పొరపాటున దిగిపోయాడు. అమాయత్వం కారణంగా తన సొంత ఊరు పేరు చెప్పుకోలేక నెల్లూరులోనే ఉండిపోయాడు. కామరాజు కోసం కుటుంబ సభ్యులు తిరుపతితో పాటు అన్నిచోట్లా వెతికినా ఆచూకీ దొరకపోవడం.. అదే సమయంలో కరోనా కేసులు ఉద్ధృతంగా ఉండటంతో మృతి చెంది ఉంటాడని భావించారు. ఇక వెతకడం మానేశారు. ఇటీవల కామరాజు దీనస్థితిని చూసి యూట్యూబర్ మాలి (మాలిమాలి123) వీడియో తీసి తన చానెల్‌లో పోస్టు చేశారు. ఆ వీడియోను గేదెలవానిపేటకు సాధు అప్పలనాయుడు చూసి మాలిని సంప్రదించాడు. పూర్తి వివరాలు తెలియజేయడంతో మాలి నెల్లూరులో ఉన్న కామరాజును గేదెలవానిపేట తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మాలి మానవత్వాన్ని మెచ్చుకుని గ్రామపెద్దలు బుధవారం గేదెలవానిపేటలో సన్మానం చేసి అభినందించారు. కాగా, కామరాజు భార్య నాలుగేళ్ల కిందటే మరణించగా.. ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు.

ఆరేళ్లకే ఆయుష్షు తీరింది!

- మంచినీటి కోనేరులో జారిపడి బాలుడు మృతి
- పెద్దతామరాపల్లిలో విషాదం



హేమాంశ్‌దత్త (ఫైల్)

నందిగాం: పాఠశాల నుంచి వచ్చేసరికి ఆడుతూ–పాడుతూ కనిపించే కుమారుడు కనిపించకపోయేసరికి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఊరంతా గాలించారు.రాత్రంతా ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో చివరికి సామాజిక మాధ్యమాల్లో సైతం పోస్టులు పెట్టారు. ఒక రోజు గడిచాక బాలుడు చెరువులో శవమై తేలడంతో నిర్ఘాంతపోయారు. కుమారుడు ఇక లేడని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతామరాపల్లికి చెందిన కొత్తూరు త్రినాథరావు, కుమారీ దంపతులకు టెన్త్ చదువుతున్న కుమార్తె పూజ, ఒకటో తరగతి చదువుతున్న కుమారుడు హేమాంశ్ దత్త(6) ఉన్నారు. ఎప్పట్లాగే హేమాంశ్‌దత్త మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తల్లిదండ్రులు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల పనికోసం నందిగాం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి హేమాంశ్ ఇంటి వద్ద కనిపించలేదు. ఆడుకునేందుకు బయటకు వెళ్లి ఉంటాడని భావించారు. చీకటి పడుతున్నా తిరిగి రాకపోయేసరికి గ్రామమంతా వెతికారు. పెరట్లో యూనిఫాం కనిపించడంతో అనుమానంతో పక్కనే ఉన్న కోనేరులో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. రాత్రంతా వలలతో చెరువులో గాలించినా ఫలితం లేకపోయింది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బాలుడి చిన్నాన్న మేఘూరావుకు హేమంశ్‌దత్త మంచినీటి కోనేరులో శవమై తేలియాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు టెక్కలి ఆస్పత్రికి మృతదేహం తరలించి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి త్రినాధరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడు పడిపోయిన మంచినీటి కోనేరు ఇదే

క్లుప్తంగా

మానవత్వాన్ని చాటుకున్న సీడాప్ చైర్మన్



మహిళలను ఆస్పత్రికి తరలిస్తున్న 108 వాహన సిబ్బంది

ఇచ్ఛాపురం: రాష్ట్ర సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆపదలో ఉన్న మహిళను ఆస్పత్రికి తరలించేలా కృషి చేసి ఉదారతను చాటుకున్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో బిచ్చమెత్తుకుని జీవనం సాగించే మహిళ వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం అపస్మారక స్థితికి చేరుకుంది. విజయవాడ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లిన శ్యాంప్రసాద్‌రెడ్డి ఆపదలో ఉన్న మహిళను చూసి చలించిపోయారు. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేసి ఆస్పత్రిలో చేర్పించి వైద్యసదుపాయాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

ప్రణాళికా బద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు

- బీఆర్‌ఏయూ వీసీ వెంకటరావు



మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతోందని బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పిటర్ డెక్కర్ సెమినార్ హాల్లో ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ వంటి కోర్సులు చదువు తున్న విద్యార్థులు యంగ్ మేనేజర్లుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రతి విద్యార్థి నిరంతరం తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రస్తుత కాలానుగుణంగా వచ్చిన మార్పులు గమనించి అందుకు తగ్గట్టుగా విద్యలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, హానరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కూన అచ్యుతరావు పాల్గొన్నారు.

అనురాగనిలయంలో పాము కలకలం



పాముతో గ్రీన్‌మెర్సీ సీఈఓ రమణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయం భవనంలోకి బుధవారం నాగుపాము ప్రవేశించడంతో పిల్లలు, వృద్ధులు హడలిపోయారు. వాషింగ్ మిషన్‌లోకి పాము వెళ్లిన విషయాన్ని గుర్తించిన సిబ్బంది గ్రీన్‌మెర్సీ స్నేక్ హెల్ప్‌లైన్‌కు తెలియజేశారు. గ్రీన్ మెర్సీ సీఈఓ రమణమూర్తి పామును చాకచక్యంగా పట్టుకుని అటవీ సిబ్బంది సాయంతో అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు రెస్క్యూ టీంను అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: అక్కవరం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు ఢీకొని గాయపడిన బండి సిమ్మయ్య(50) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

జనం చెంతనే రక్తసేకరణ

- రక్త సేకరణకు సంచార అంబులెన్స్
- కోచ్‌లో అత్యవసర సామగ్రి



సంచార అంబులెన్స్

శ్రీకాకుళం కల్చరల్: ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరం. సకాలంలో రక్తం అందకపోతే ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా..ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి రక్తం అందించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ కృషి చేస్తోంది. తరచూ రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తదాన్ని సేకరించి అవసరమైన వారికి అందజేసి ప్రాణదాతగా నిలుస్తోంది. ఇందులో భాగంగా రక్తనిధి కేంద్రానికి అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ సంచార అంబులెన్స్‌ను ఏర్పాటు చేసుకుంది. న్యూఢిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖకు అంబులెన్స్‌ను సమకూర్చింది. దీన్ని గత ఏడాది జూలై 24వ తేదీన కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ శ్రీకేష్ బి. లాఠకర్ ప్రారంభించారు.

అత్యవసర సౌకర్యాలు

రక్తసేకరణ కోసం కేటాయించిన అంబులెన్స్‌లో పలు సౌకర్యాలు ఉన్నాయి. ఏసీ, జనరేటర్, కుడి భాగంలో ఏసీ ఇన్వర్టర్, బ్యాటరీలు, లోపలి భాగంలో మూడు బ్లడ్ డోనర్ కోచ్‌లు ఉన్నాయి. అలాగే ఒక రిఫ్రిజరేటర్, టీవీ, బీపీ చెక్ చేయడానికి వీలుగా నాలుగు మిషన్లు, సెలర్ ఒకటి, హిమోగ్లోబిన్ మెషీన్‌లు రెండు, వాషింగ్ టబ్ ఒకటి, మెడికల్ ఆక్సిజన్ సిలెండర్‌లు రెండు, ఎమర్జెన్సీ ఫైర్ కిట్‌లు రెండు, ఐదు కుర్చీలు, రక్తం భద్రపరిచేందుకు రెండు కూల్ బాక్సులు, మంచినీరు నిల్వ చేయడానికి మిలన్ ఉంది. ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్లు అంబులెన్స్‌లో ఉంటారు.



అంబులెన్స్‌లో రక్తం సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

520 యూనిట్ల రక్త సేకరణ

శ్రీకాకుళం రెడ్‌క్రాస్ యూనిట్‌కు అంబులెన్స్ కేటాయించడం ఆనందంగా ఉంది. దీంతో ఎక్కడ బ్లడ్ డొనేషన్ క్యాంప్ చేయాలంటే అక్కడికి వెంటనే వెళ్తున్నాం. బస్సులోనే అన్ని సదుపాయాలు ఉండడంతో రక్తసేకరణ సులువుగా ఉంది. అంబులెన్స్ వచ్చిన తరువాత 22 శిబిరాలు నిర్వహించి 520 యూనిట్ల రక్తం సేకరించాం. కనీసం 20 మంది రక్తదానం చేసేందుకు ముందుకొస్తే వెంటనే అక్కడికి అంబులెన్స్‌తో తమ సిబ్బంది చేరుకుంటారు. రక్తదానం చేయాలనుకుంటే 08942-226555 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

ఆర్‌బీకేలతో మెరుగైన సేవలు

- వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ ఏడీ రాజన్



ఎందువపేటలో ఈక్రాప్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏడీ రాజన్ తదితరులు

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతకు మెరుగైన సేవలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జె.డి.రాజన్ అన్నారు. జగన్నాథవలస ఆర్‌బీకేని బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ చేపట్టడంతో సంక్షేమ పథకాలు నేరుగా రైతులకు చేరుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలతోపాటు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. రైతులు సాగుచేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వం రాయితీతోపాటు మద్దతు ధర కల్పిస్తోందని స్పష్టం చేశారు. అనంతరం వెంకయ్యపేట, ఎందువపేట గ్రామాల్లో చేపట్టిన ఈక్రాప్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే నంబర్ ప్రకారం సాగు చేసిన పంటల వివరాలను పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు.

సిబ్బంది పనితీరుపై సంతృప్తి

ఆర్‌బీకేల అగ్రికల్చర్ అసిస్టెంట్ల పనితీరును ఏడీ అభినందించారు. రైతులకు అందిస్తున్న సేవలు, సర్వే నంబర్ల ఆధారంగా పంటల వివరాలు నమోదు చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోనే జి.సిగడాం మండలంలో పని చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది పనితీరును రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా తీసుకుంటామని రాజన్ వెల్లడించారు. ప్రభుత్వం ప్రచురిస్తున్న రైతుభరోసా పుస్తకాలల్లో జి.సిగడాం మండలంలోని వివరాలు వచ్చేవిధంగా చర్య లు తీసుకుంటామని వెల్లడించారు. అగ్రికల్చర్ సిబ్బంది సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. రణస్థలం ఏడీఏ వద్దాది శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారిణి యర్రా శారద, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అంపోలు అనుషా, అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హరీష్, బోడసింగి రాణి, వీఆర్వో దుర్గాశి రాజు, సర్వేయర్ సిరుగుడు కిశోర్ ఉన్నారు.



అనూషాను సత్కరిస్తున్న దృశ్యం

అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సత్కారం

జగన్నాథవలస ఆర్‌బీకేలో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ అంపోలు అనుషాను ఏడీ రాజన్ అభినందించి సత్కరించారు. ఈమె రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వంద టన్నుల ఎరువులు, పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ చేయడం, అవసరమైన సలహాలు రైతులకు ఇవ్వడం ద్వారా జిల్లాలో నెంబర్ వన్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో ఆమెను ఏడీ సత్కరించారు.

దేశ సేవకుడికి సత్కారం

కాశీబుగ్గ: సైనికుడిగా విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ తరువాత స్వగ్రామానికి వచ్చిన దేశ సేవకుడికి స్థానికుల నుంచి విశేష గౌరవం లభించింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 18వవార్డు రోటరీనగర్‌కు చెందిన గోకిన చిన్నారావు ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా 23 ఏళ్ల పనిచేసి హవాల్దారుగా ఉద్యోగ విరమణ పొందారు. ఈయన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పట్టణానికి చేరుకోగా.. స్థానికులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రీన్‌ఆర్మీ సభ్యులు చిన్నారావు కుటుంబ సభ్యులకు మొక్కలు అందించి దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, ప్రభుత్వ ఉపాధ్యాయులు బత్తిన ఓంకార్, దాసరి శ్రీనివాసరావు, నగిరి లక్ష్మి, బోకర దుర్యోధన, క్రిష్ణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారావును సత్కరిస్తున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు, ఉపాధ్యాయులు

నమ్మకంగా దోచేశారు..

- వృద్ధురాలి నుంచి బంగారం గొలుసు అపహరణ

సారవకోట: ఓ వృద్ధురాలిని నమ్మించి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని తెంచుకుపోయిన ఘటన సారవకోట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. తొగిరి గ్రామానికి చెందిన వృద్ధురాలు మట్ట ఎర్రమ్మ అలుదు గ్రామంలో జరిగిన బంధువుల వివాహ కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి తొగిరి గ్రామానికి వెళ్లేందుకు వడ్డినవలస దగ్గర ఆటో దిగింది. అక్కడ నిరీక్షిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి తొగిరి గ్రామానికి తీసుకెళ్తానని నమ్మించి ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో వాహనాన్ని నిలిపి అప్పటికే అక్కడ వేచి ఉన్న మరో వ్యక్తితో కలిసి ఎర్రమ్మ మెడలో ఉన్న మూడుప్పావు తులాల బంగారం గొలుసును తెంచుకుని పరారయ్యారు. బాధితరాలు సారవకోట పోలీసుస్టేషన్‌కు చేరుకొని జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ రమణమూర్తి కేసు నమోదు చేశారు. సమీప పోలీసు స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మందస: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. మందస పట్టణానికి చెందిన కీలు కాంతమ్మ (40) కుటుంబ కలహాలతో ఈ నెల 13వ తేదీన గడ్డి నివారణకు వినియోగించే మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా ప్రథమ చికిత్స అందించారు. అయితే ఆమె పరిస్థితి విషమించడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందు తూ కాంతమ్మ బుధవారం మరణించింది. మందస పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ టి.వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎనుకోటి రవి కుమార్ తెలిపారు.



కాంతమ్మ మృతదేహం

జ్యోతిబాపూలే పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులకు అస్వస్థత



స్పృహలోకి వచ్చిన చిన్నారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం రాత్రి ఏడుగురు బాలికలు అస్వస్థతకు గరయ్యారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రవల్లిక, తనూశ్రీ, రోజా రాణి, శోభ, పల్లవి, కీర్తన, సుప్రియలకు కళ్ల మంటలు, వాంతులు, తలనొప్పి, ఆయాసం వంటి సమస్యలు రావడంతో 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పర్యవేక్షించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పలాస తహశీల్దారు లంబాల మధుసూదన్ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. ఎటువంటి అపాయం లేదని నిర్ధారించడంతో ప్రిన్సిపాల్, వార్డెన్లను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. గురువారం ఉదయం రక్తపరీక్షలు జరిపితే పూర్తి వివరాలు తెలుస్తాయని, ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



సందపు సీతయ్య (ఫైల్)

పాతపట్నం: మండలంలోని బడ్డుబట్రి పంచాయతీ శిష్టుజగన్నాథపురం గ్రామానికి చెందిన వృద్ధుడు సందపు సీతయ్య(66) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతయ్య బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలో పొలం పనులు చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా మెళియాపుట్టి మండలం పింగువాడ నుంచి తెంబూరు వైపు వస్తున్న మ్యాక్సీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సీతయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే గ్రామస్తులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. సూపరింటెండెంట్ సురేంద్రకుమార్ ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సీతయ్యకు కుమారుడు సందపు సుదర్శన్, కుమార్తె జ్యోతి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

లారీ ఢీకొని యువకుని దుర్మరణం



అశోక్‌కుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి: లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం ఏఎస్ కాలనీకి చెందిన దొన్న అశోక్‌కుమార్ (30) నల్లగొండలోని కేఎఫ్‌సీలో బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన తర్వాత బుధవారం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఫ్లైఓవర్ వద్ద నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం అనంతరం లారీ ఆపకుండా వెళ్లడంతో పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. లారీని, డ్రైవర్‌ను వాడపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకుని నార్కట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎంఈఎంయూ రైలు పునఃప్రారంభం



ఎంఈఎంయూ రైలుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు/పొందూరు: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీ విజయసాయిరెడ్డి కృషితోనే పలాస– విశాఖపట్నం ఎంఈఎంయూ రైలు బుధవారం పునఃప్రారంభమైందని వైఎస్సార్ సీపీ వజ్రపుకొత్తూరు మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు అన్నారు. మూడేళ్ల తర్వాత పునఃప్రారంభమైన రైలుకు బుధవారం పూండి రైల్వే స్టేషన్ వద్ద ఉద్దానంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. లోకో పైలట్లకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కాగా, కోవిడ్ కారణంగా ఈ రైలును అప్పట్లో రద్దు చేశారు. కోవిడ్ ప్రోటోకాల్ విరమించినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో కిడ్నీ రోగులు, ఉద్దానం ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి సీదిరి అప్పలరాజుకు సమస్యను వివరించి ఆయన సిఫారసుతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్, వాల్తేరు డీఆర్‌ఎంకు పలుమార్లు వినతి పత్రాలు అందించారు. చివరకు ఎంపీ వి.విజయసాయి రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన కృషితో ఎంఈఎంయూ రైలు పట్టాలు ఎక్కించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిన రమ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొల్లి రమేష్, గొరకల విశ్వనాధం, గొరకల రామారావు, పూండి ఉద్దానం ప్రాంత సర్పంచ్‌లు ఎ.గోవిందరావు, టి.సుశీల, కె.భాస్కరరావు, చింత హేమారావు, వంక చిరంజీవి, చింత రాజు, పార్టీ నాయకులు కణితి భగవాన్, డి.మోహనరావు, ఎం.వెంకటరావు, జి.లక్ష్మణరావు, శేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పొందూరు రైల్వే స్టేషన్‌లో ఈఎంయూ రైలు బుధవారం పునప్రారంభమైంది. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సర్కార్, స్టేషన్ మాస్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, 07470/71 నంబరు గల ఎంఈఎంయూ పాసింజర్ ఉదయం 7 గంటలకు విశాఖలో ప్రారంభమై మధ్యాహ్నంకు పలాస చేరుతుంది. తిరిగి 1.30 గంటల పలాసలో ప్రారంభమై 5.30కు విశాఖ చేరుతుంది. పలాస, పూండి, రౌతుపురం, నౌపడ, దండుగోపాలపురం, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, తిలారు, శ్రీకాకుళం రోడ్డు, దూసి, పొందూరు, జి.సిగడాం, బాతువలలో రెండు నిమిషాలు చొప్పున నిలుస్తుంది.

టీడీపీ కార్యకర్త దౌర్జన్యం!

- నిరుపేద ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న వైనం




టీడీపీ కార్యకర్త రామారావు కూల్చేసిన గోడ వద్ద బాధితురాలు పూర్ణమ్మ

ఇచ్ఛాపురం రూరల్: ప్రతీ నిరుపేదకు పక్కా ఇల్లు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. అయితే టీడీపీకి చెందిన నాయకులకు మాత్రం ఇది కడుపుమంటగా మారింది. ఓ నిరుపేద ఇంటి నిర్మాణాన్ని అడ్డుకొని తమకున్న కోపాన్ని ప్రదర్శించాడో టీడీపీ కార్యకర్త. వివరాల్లోకి వెళితే.. ఈదుపురం గ్రామానికి చెందిన దూపాన పూర్ణమ్మ భర్త చనిపోయారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడుతో జీవిస్తోంది. ఈమె కు ఇల్లు లేదు. దీంతో జగన్న కాలనీలో ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి కావస్తున్న దశలో స్థానిక టీడీపీ కార్యక్త ఉప్పాడ రామారావు మూడు నెలలుగా పనులకు అడ్డుపడుతూ ఆమెతో ఘర్షణకు పాల్పడుతున్నాడు. బుధవారం మరో మారు విరుచుకుపడిన రామారావు నిర్మించిన గోడను కూల్చేశారు. దీంతో బాధితరాలైన పూర్ణమ్మ ఎంపీటీసీ సభ్యుడు నర్తు ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకుంది. గ్రామ పెద్దలు రామారావుకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వినలేదు. తన సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుందని రామారావు చెప్పడంతో పెద్దలు సైతం అవాక్కైయ్యారు. పూర్ణమ్మ మాత్రం తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతునవుతా..

- పట్టభద్రుల నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దుప్పల




మాట్లాడుతున్న రవీంద్రబాబు

శ్రీకాకుళం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకనై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసనమండలికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుప్పల రవీంద్రబాబు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీలో మెటలార్జికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశానని, ఎంబీఏ కూడా చదివినట్టు చెప్పారు. తండ్రి పేరున డీకే ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. గతంలో బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశానని, అలాగే శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశానని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన 23 సంస్థల్లో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు ఏ ఒక్క సంస్థను కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రధాన సమస్యలపై దృష్టిసారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు మాట్లాడుతూ.. దుప్పల కృష్ణమూర్తి సీనియర్ జర్నలిస్ట్‌గా, ప్రజాసమస్యలపై పోరాడే వ్యక్తిగా ఎంతో పేరుగాంచారని అన్నారు. ఆయన కొడుకుగా రవీంద్రబాబు కూడా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తు అనేక సామాజిక కార్యక్రామలు చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు తన మేనిఫేస్టోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువర్గాల ప్రతినిధులు శిష్టు రమేష్, ఎన్.ఈశ్వరరావు, పైడి సత్యం మాస్టారు, జీవీ నాగభూషణరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నైతిక పరీక్ష

- 530 మంది గైర్హాజర్
- పర్యవేక్షించిన ఆర్‌ఐఓ, డీఈసీ కమిటీ కమిటీ
- 17న ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష



కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బుధవారం జరిగిన నైతికత, మానవతా విలువల (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలో డీఈసీ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. ఆర్‌ఐఓ శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి పరీక్ష జరిగిన తీరును పరిశీలించారు.

25,249 మంది హాజరు

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరధిలో ఉన్న 205 జూనియర్ కళాశాలల్లో బుధవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. 25,779 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 25,249 మంది రాశారు. వివిధ కారణాలతో 530 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కోర్సుల నుంచి 23,478 మందికి 416 మంది, ఒకేషనల్ కోర్సుల నుంచి 2,301 మందికిగాను 114 మంది డుమ్మా కొట్టారు.

దిద్దుబాటు పూర్తి, మార్కుల కేటాయింపు

తప్పనిసరిగా రాయాల్సిన పరీక్ష థియరీకి 60 మార్కులు, ప్రాజెక్ట్ రికార్డుకు 40 మార్కులు వెరసి 100 మార్కులకు జరిగింది. అన్ని జూనియర్ కళాశాలల్లో అక్కడి లెక్చరర్లే ఇన్విజిలేటర్లగా వ్యవహరించారు. అనంతరం జవాబుపత్రాలకు వాల్యూషన్ చేసి మార్కులు కేటాయించారు. వాటిని ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో ప్రిన్సిపాళ్లు అప్‌లోడ్ చేశారు.

రేపు మరో పరీక్ష

ఫస్టియర్ విద్యార్థులు ఈ నెల 17వ తేదీన పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పేరిట మరో పరీక్ష రాయాల్సి ఉంది. ఇది కూడా తప్పనిసరిగా రాయాల్సి ఉండడంతోపాటు పాస్ కావాల్సి ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. గతంలో గైర్హాజరైన/ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు కూడా వారి కాలేజీలకు హాజరై పరీక్ష రాయవచ్చని ఆర్‌ఐవో తవిటినాయుడు సూచించారు. బుధవారం జరిగిన, 17వ తేదీన జరగనున్న పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకుంటే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పాస్ సర్టిఫికెట్లు జారీకావు.